# యుగసంధి

ముఖమంతా నోరేనేమోననిపించేలా వ్యాకోచిస్తున్న పెదవుల్లోంచీ పిచ్చిపట్టిన కుక్కపిల్ల ఆక్రోశంలాంటి వింత శబ్దమొకటి ప్రసారమవుతుండగా పెద్దగా ఆవులిస్తూ యింకా సిమెంటు పూతను కప్పుకోని యిటుకరాళ్ల వరండాలోకొచ్చి నిల్చున్నాడు పాలకూరు సుబ్బయ్య. తడిసిన వస్త్రాల్ని తలపైనున్నంచీ తప్పించి, రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ప్రసాదరెడ్డి బంగళావైపుకోసారి చూపుల్ని మరల్చాడు.

పలచటి చినుకుల పరదాకవతల, చీకటి దొంతరల మధ్య వొంటరి ఆసుపత్రి భవనంలా బిక్కుబిక్కుమంటూ వుంది ప్రసాదరెడ్డి బంగళా. యింటిచుట్టూ వున్న చెట్లు సైతం చీకటి ముసుగుల్ని కప్పుకోవడంతో అదెంత పెద్ద యిల్లో తెలియడం లేదు. దాదాపు కిలోమీటరు దూరంలో వున్న నగరపు దీపాలు చెలరేగిన మిణుగుర్ల గుంపులా కనిపిస్తున్నాయి. ఫర్లాంగు దూరానికవతలున్న శివారు కాలనీ దీపాలు మొసలిగుడ్లలా కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. పది బారల కవతలున్న గ్రాండ్ ట్రంక్ రోడ్డుపైన తలలకు దీపాల్ని తగిలించుకున్న గని పని మనుషుల్లాంటి వాహనాలు కారుబారు చేస్తున్నాయి. తాను నిల్చున్న చోటులోంచీ బంగళాలో దీపం వెలుగుతున్న యేకైక గది కిటికీకేసి చూసీచూడగానే సుబ్బయ్య వులిక్కిపడ్డాడు. అద్దాల కిటికీపైన పడుతున్న పలచటి దీపపు కాంతికి దట్టంగా అడ్డంపడుతున్న నీడ ఎవరిదో అతడికి వెంటనే స్ఫురించింది. వెనకవైపున గుప్పెడు వెంట్రుకలు మాత్రమే మిగలిన ప్రసాదరెడ్డి బట్టతలతో బాటూ చీకి పారేసిన తాటిముట్టె కూడా అతడికి జ్ఞాపకం వచ్చింది. కంగారుపడుతూ తాను నిల్చున్న యింటికేసి తిరిగాడతను. ప్రసాదరెడ్డి బంగళా అనే చీకటి గుయ్యారానికి క్రీనీడలా దానికి ఆనుకునే వుంది ఆ యిల్లు. నీళ్లతో తడిసిన సిమెంటు గోడలతో తడితడిగా వున్నాయి గోడలు. తలుపులూ కిటికీలూ చోటుచేసుకోబోయే స్థలాల్లో పెద్ద పెద్ద ఖాళీలతో అప్పుడే తోలు తీసేసిన కళేబరంలా భీకరంగా కనిపిస్తోంది ఆ యిల్లు.

యథాలాపంగా యింటిలోపలికి అడుగుపెట్టగానే మరోసారి వులిక్కిపడ్డాడు సుబ్బయ్య. పట్టపగల్లా వెలుగుతున్న విద్యుద్దీపపు కాంతిలో, రొచ్చు రొచ్చుగా పడివున్న సిమెంటు

డాగుల మధ్య పాత కుక్కి మంచంపైన పడుకున్న ఆకారాలు రెండూ అతడి రాకను గమనించనేలేదు. గోడవైపుగా పడుకున్న ముప్పయ్యేళ్ల ఆడమనిషి తలంతా రేగిపోయి వుంది. కొప్పులోని చెండుమల్లి పూలరేకులు ఆమె నల్లటి ముఖంపైని చెమటలో అతుక్కుపోయి వున్నాయి. చాకలిబండకు అతుక్కుపోయిన గుడ్డపేలికలా జాకెట్టు ఆమె శరీరానికంటుకుపోయి వుంది. నడుముకు చుట్టుకున్న పాత లుంగీ మినహా మరే ఆచ్ఛాదన లేని మగ మనిషి నల్లటి శరీరం తుప్పుపట్టిన యినపస్తంభంలా కనిపిస్తోంది. యీదురు గాలులు, యీడ్చి కొడుతున్నా అతడి ముఖంపైన చెమట బిందువులు పొటమరించే వున్నాయి.

వొక అడుగు ముందుకేసి మరోసారి వాళ్లిద్దరినీ అనుమానంగా చూశాడు సుబ్బయ్య. చాచిన అతడి జబ్బపైన ఆమె తలా, చీర తొలగిన ఆమె మోకాలిపైన అతడి పాదమూ మోపుకుని వున్నాయి. జీరంగి గీ పెడుతున్నట్టుగా వినిపిస్తున్న అతడి గురకను సైతం సరకు చేయకుండా ఆమె నిద్రపోతోంది.

అయిదు నిముషాలసేపు కళ్లార్పడం కూడా మరచిపోయి నిల్చుండిపోయాడు సుబ్బయ్య. వేగంగా వీస్తున్న గాలికి పెరట్లోని డబ్బారేకులేవో డబడబలాడుతున్నాయి. దూరంనుంచీ పామునోట్లో చిక్కుకున్న బావురుకప్ప గాండ్రింత అసహ్యంగా వినిపిస్తోంది. పిచ్చివాడి చేతి వాయిద్యాల్లా కీచురాళ్లు కయ్యిమంటున్నాయి.

మెడపైన యింజెక్షను వేసినట్టుగా కుట్టిన దోమను గట్టిగా అరిచేతితో చరిచాడు సుబ్బయ్య. గది మూలలో తోక ముడుచుకుని పడుకున్న కుక్కపిల్ల తలపైకెత్తి చూసింది. మరోవైపు తాబేలులా ముడుచుకుని పడుకున్న కోడిపెట్ట తల మాత్రం పైకెత్తి చూసి, మళ్లీ తన మామూలు భంగిమలోకి వెళ్లిపోయింది. పెద్దగా గుర్రంలా సకిలించాడు సుబ్బయ్య. మంచంపైన పడుకున్న స్త్రీపురుషులిద్దరూ వులకలేదు. ''తూ! పో బయటికి...'' అంటూ పెద్ద మట్టిపెళ్లను చేతికందుకుని కుక్కపిల్లకేసి విసిరాడతను. అది గొల్లుమని గీపెడుతూ దౌడు తీసింది.

చేతిలోని పొడవాటి వెదురుకట్టెతో మంచం బద్దెపైన పెద్దగా బాదుతూ ''రేయ్ సంజీవీ! మేయ్, మూలస్థానామ్మా! ధూము తగిలినట్టుగా అప్పుడే నిద్రెట్ల తన్నుకొచ్చింది మీకు! లెయ్యండి పైకి...'' అంటూ గావుకేకలు పెట్టాడు సుబ్బయ్య.

మూలస్థానమ్మ బలవంతంగా కళ్లు విప్పి చూసి, విసుగ్గా పెదవులు చప్పరించి, పెద్దగా మూలుగుతూ మళ్లీ కళ్లు మూసుకుంది. సంజీవి మాత్రం మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచి పెట్టుకుంటూ పైకిలేచి కూర్చున్నాడు.

''యిదేనా మీరు చేసే వాచ్‌మెన్ డూటీ? యీడ సామాన్లు ఆడే పడుండాయి. యెవుడైనా వచ్చి చేతికి దొరికింది జవురుకోనిపోయినా అడిగే దిక్కూ దివాణమూ లేదు. యేమైనా జరిగితే రేప్పొద్దన జబాబు చెప్పాల్సిందెవురు? మీరా, నేనా?'' అంటూ సుబ్బయ్య పెద్దగా రొప్పసాగాడు.

సంజీవి కడవలోంచీ నీళ్లు ముంచుకుని గుటగుటా శబ్దం చేస్తూ చెంబుడు నీళ్లు తాగేశాడు. పంచె రొంపిలోంచీ బీడీ పైకి తీసి వెలిగించుకుంటూ మంచం పైకొచ్చి కూర్చున్నాడు.

సుబ్బయ్య నిలువునా వూగిపోతూ ''నేను అడిగేదేందీ; నువ్వు చేసేదేందీ? దినదినానికీ మీకు కండ్లు నెత్తిమీదకొచ్చేస్తావుండాయి. కన్నూమిన్నూ కనపడాటం లేదు. పోతే పోనీ అని ధర్మానికి పోతావుంటే మీకు యెకసెక్కంగా వుండాది...'' అంటూ రంకెలేయసాగాడు.

తాపీగా సగం బీడీ తాగిన తర్వాత ''అయితే యీ పొద్దు కూడా మామండూరుకు పోయి రాలేదాన్నా?'' అన్నాడు సంజీవి పదాలు కూడబలుక్కున్నట్టుగా.

''అది నీ కనావస్యం. నీ కతేందో నువ్వు చూసుకో...'' చిత్రంగా చేతులు తిప్పుతూ నాట్యభంగిమలా నిల్చుని సుబ్బయ్య వాదించసాగాడు. ''యీ వలాదిరిగా వొళ్లు తెలియకుండా నిద్రపోతే, దొంగతనం జరిగితే, రేప్పొద్దన యే ముఖం పెట్టుకోని తిరగతావు నువ్వు? యిప్పుడయిన యాస్కాలు చాల్లేదా? యింకా జాంబండి కూడా పోలేదు. నిన్న పెద్దరెడ్డి యేం జెప్పినాడు? యీ రెండు మూడు దినాలు కంటిమీద రెప్పెయ్యకుండా కాపలా గాయమన్నాడా లేదా జెప్పు! పోలీసులు కూడా వార్నింగిచ్చినారా లేదా? పోయిన తడవ దోపిడీ జరిగినప్పుడెంత ఆగమయిందో అప్పుడే మరచిపోయినారా? బంగళాలో పెదరెడ్డీ, ఆయిన పెండ్లామూ మాత్రమే వుండారు. వాళ్ల కొడుకులిద్దురూ హైద్రాబాదులో వుండిపోయినారు. యిట్లాంటప్పుడు ఆదమరచి నిద్రపోవచ్చునా?...''

''వూరికే గొంతు నొప్పిపుట్టేటట్టుగా అరస్తావుండావేందన్నా! కొంచుం కండ్లు తెరిచి పెద్దరెడ్డి యింటిపక్కకోసారి జూడు. యినప్పటిమాదిరుండాదో లేదో చెప్పు...'' అన్నాడు సంజీవి మెల్లగా.

ఆరడుగుల పొడవున్న బండరాళ్ల ప్రహరీగోడ... ముఖద్వారాన్ని రక్షిస్తూ గ్రిల్ గేటు. యెక్కడ యే గది వుందో తెలియనివ్వకుండా పహారా కాస్తున్న చీకటి. యింటిలోపల వెలుగుతున్న యేకైక దీపపు కాంతినంతా పీల్చేస్తున్నట్టున్న బట్టతల వ్యక్తి నీడ.

''గుబురుగా చెట్లుంటే అదుపు తప్పిపోతిందని పెద్దపెద్ద చెట్లన్నీ కొట్టిపారేసినారు. టెలిఫోను తీగల్ని తెంచిపారేసినా బయిం లేకుండా పెద్ద అలారం బెల్లు యేర్పాటు చేయించినారు. రెయ్యంతా మీరిద్దరూ కాపలా పడుంటారు. యిద్దరు పోలీసోళ్లు వస్తారు డూటీకి. పోలీసు జీబు రేత్రుల్లో వొకటికి రెండుసార్లు వచ్చిపోతానే వుంటాది. చీమా దోమా గూడా లోపలికి పొయ్యే దోవ లేదు. యింక బయమెందుకు...'' అన్నాడు సంజీవి నవ్వుతూ.

''పోయిన తడవ యిక్కడ దొంగతనం జరిగినప్పుడు వారం దినాలదాంకా జైల్లో కూర్చోని వచ్చినావు. నెలదినాలు రొయాస్పత్రిలో మందు తిన్నాంక కూడా లోదెబ్బలు తగ్గకుండా అగోరించినావు. యెవురికుండాల బయం? నీకా, నాకా?'' అంటూ సుబ్బయ్య హుంకరించాడు.

''మాటాడేదాని కేముండాదిలేన్నా! యెట్లయినా మాట్లాడొచ్చు. నోటికేమయినా తలుపా, దాలబంధరవూ? నాలుక్కు యేమికేడుండాదిలే!...'' తనూ వాగ్వివాదానికి దిగేశాడు సంజీవి. ''యేందో దోవను బొయ్యేవాడు, అతీగతీ యెవుడూ చూడర్లే అని వుత్తి పున్యానికి టేషనుకు తోస్తిరి మీరంతా కలుసుకోని. రొండు మూడు నెల్లకు ముందు పోలీసులు అసలు దొంగల్ని పట్టేసినారనీ, పోయిన నగానట్రా అంతా పెద్దరెడ్డికి జేరిపోయిందనీ నువ్వేగదా చెప్పినావు. కాయకష్టం జేసుకోని బతికేటోళ్లం. మమ్మల్ని కన్నబాధలూ పెడితిరిగదా? బగమంతుడు వోరస్తాడా యిదంతా?''

''అందుకేరా పిచ్చి పుల్లయ్యా! నీకు యిలావిరిగా జెప్తావుండాన్నేను. యేడబొయ్యి యేమొచ్చినా ముందుగా యేటుబడేది నీ పైన్నేగదా? అందుకనే యేమారకుండా కాపెట్టుకోనుండాల. యేనుగులు పైబడినా లెయ్యకుండా యీ మాదిరిగా నిద్రపోతే గుణం లేదు''

''యీశ్వరుడెట్ల రాసిపెట్టుంటే అట్ల జరగతాదన్నా! కాలం గాకపోతే కొయ్యే పామై కరస్తాది. లేకపోతే తప్పంతా మాదేనని ఘుందుగా పోవిడి మాటలు జెప్పింది నువ్వేగదా? పోలీసల్తో సాక్షికం జెప్పింది కూడా నువ్వేగదా? యిప్పుడేమో సబ్బక్క మాటలు జెస్తావుండావుగానీ...''

''మేస్త్రీని పట్టుకోని వాచ్‌మేనుద్దోగం కొట్టుకోని పోయినట్లనుకుంటివారా? యిల్లలకగానే పండగయి పోతిందారా బాడకోవ్! గుణాతం యెయ్యకముందు నించీ, బోరింగేసినప్పటినించీ యిక్కడ్నే కాపెట్టుకోనునింది నేను! మద్దెలో వచ్చిన నీకు వాచ్‌మేనుద్దోగమా? యిది మాత్రం న్యాయంగా వుండాదా నీకు?'' ప్రసాదరెడ్డి బంగళావైపు కోపంగా చూస్తూ సుబ్బయ్య బీడీ వెలిగించాడు.

''మట్టి పని జేసేది మాకు కులవృత్తి గదన్నా! మీ బలిజోళ్లకు అదెట్ల వల్లపడితింది? మావోళ్లంతా వాచ్‌మేనుద్దోగాలకు యెత్తిన చెయ్యి. పని తెలిసిన మమ్మల్ని పనిలో పెట్టుకుంటారా? కరిణిచేత బట్టేదిగూడా రాని నిన్ను పనిలో చేర్చుకుంటారా? యీ యవ్వారం మనుసులో పెట్టుకోని, వుత్తిపుణ్యానికి నామింద నిందేస్తివిగదా! పుట్టి యీ గడ్డపైన పడిన కాడినించీ యెన్ని పనులు చేసుంటాను. యావాడైనా యేలెత్తి చూపించుకోనుంటినా నేను? గంగమ్మ గుడికాడ సుందరరామిరెడ్డి నాలుగంతస్తుల మిద్దీ గట్టించినప్పుడు నేనేగదా వాచ్‌మేను! దమ్మిడీ సొత్తు లెక్క తప్పొయ్యున్నా? నా సంగతి పాపులర్ యేజెన్సీస్ రంగసామి నడుగు. బైరాగి పట్టెడ రాజగోపాలనాయుడు నడుగు. నీ మూలాన నింద మొయ్యాల్సి వచ్చింది గదా! పోలీసుల్తో అబద్ధం చెప్పేదానికి మనసెట్ల వచ్చిందన్నా నీకు?'' అంటూ సంజీవి నిలదీసి ప్రశ్నించాడు.

''నాకంతా తెలుసులేరా సంజీవీ! ఆ పొద్దు కొంచెం నీళ్ల యెక్కువై వుంటాయిలే!'' అంటూ సుబ్బయ్య గొంతుక తగ్గించి ''అది సరే గానీ, బంగాకుండాదా?'' అని ప్రశ్నించాడు.

సంజీవి అతడినోమారు పైకీ కిందికీ చూసి, నవ్వడానికి ప్రయత్నించి, విఫలుడైపోతూ లేదన్నట్టుగా పెదవి విరిచేశాడు.

సుబ్బయ్య కోపంగా వురిమిచూస్తూ బీడీని వేగంగా బయటికి విసిరాడు. అంతకంటే వేగంగా వీస్తున్న యీదురుగాలికి బీడీముక్క లోపలికే తిరిగొచ్చి అతడిపైనే పడింది.

చిట్లుతున్న చిన్న చిన్న డైనమెట్లలాంటి చినుకులు నేలపైని ధూళిపొరల్ని చిందరవందర జేస్తున్నాయి. రోగుల్లా జుట్టు విరబోసుకుని నిల్చున్న చెట్లన్నీ అయోమయంగా వీస్తున్న గాలి తాకిడికి అలిసిపోయినట్టుగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో మెరుపులు ప్రాకినప్పుడల్లా, నిద్రలో వులిక్కిపడి మేల్కొన్న ముసలావిడ ముఖంలో తారాడే నీలినీడల్లా, ఆ ప్రాంతమంతా వెలుతురు తెరలు ప్రాకుతున్నాయి. దగ్గర్లో యెక్కడో భీకరంగా శబ్దం చేస్తూ పడిన పిడుగు, బహుశా భూమిని రెండుగా చీల్చిపారేసినట్టుగా తోస్తోంది.

''టీ కావాల్రా సంజీవీ'' అన్నాడు సుబ్బయ్య వొళ్లు విరుచుకుని ఆవులిస్తూ, సంజీవి వులిక్కిపడి తలపైకెత్తి ''యిప్పుడా?'' అన్నాడు విసుగ్గా.

''యీదురుగాలికి వొళ్లంతా యెట్టెట్టో అయిపోయింది. వుడుకునీళ్లు పడితేగానీ బండి కదలదు. అప్పటినించీ దొంగనిద్రలో వుండాది నీ పెండ్లాం. కొంచెం పైకి లెయ్యమను. చినుకుల్లో నాలుగడుగులు పారిస్తే నెత్తిపైన మొలకేమీ రాదుగానీలే!'' అంటూ సుబ్బయ్య జేబుల్లో బీడీ ముక్కేమైనా మిగిలిందేమోనని గాలించసాగాడు.

''యెంత పెద్దరెడ్డి చెప్పినాడే అనుకో, యీ వానాగాలిలో టీతెచ్చేదానికి ఆడమనిషి వల్లయితిందా?'' అన్నాడు సంజీవి జీరబోతున్న గొంతుతో.

''పోనీ నువ్వే బయల్దేరు...'' అంటూ ఫ్లాస్కును చూపెట్టాడు సుబ్బయ్య.

''చీకట్లోకి పొయ్యేదానికి నాకు వల్లపడదని నీకు తెలవదా? పైగా ఆడమనిషిని వొంటిగా వొదిలిపెట్టి నేనెట్లా పొయ్యేది?''

''మొబ్బంటే బయపడేవాడివి నువ్వేం వాచ్‌మేన్‌రా? నీ పెండ్లానికి నేను తోడుండ్లేదా...''

యెవరో యెత్తి కుదేసినట్టుగా సంజీవి నిలువునా వూగిపోసాగాడు. అంత చలిగాలిలోనూ అతడికి చెమటలు పట్టసాగాయి. పెదవులు వణుకుతుండగా అతడు గోడపైకి సోలిపోయాడు.

''నీ పెండ్లాన్నేమైనా కొరుక్కోని తినేస్తానా నేను? యేం ఫర్వాలేదులే? ఆ పెట్రోలు బంకు కాడుండే టీ హోటలు కాడికి పొయ్యొచ్చేదానికెంతసేపు పడితింది?..''

''గొడుగు లేదు. నూనె కాగితంగానీ, గోతంగుడ్డగానీ లేదు. యీ వానలో పొయ్యేదానికి నావల్ల యెట్లయితిందన్నా!'' యేడుపు ముంచుకొస్తుండగా సంజీవి ప్రాధేయపడసాగాడు.

''సరే! రేప్పొద్దన రెడ్డికామాటే చెప్పు...'' అన్నాడు సుబ్బయ్య ముక్తసరిగా.

అటువైపుకు తిరిగి పడుకున్న భార్యను కుదపసాగాడు సంజీవి. ఆమె బలవంతంగా కళ్లు తెరిచి ''గొమ్మునుండు...'' అంటూ సణిగి మరోవైపుకు దొర్లుకుంది.

''తూత్తెరీ, వడ్డినాయాలా!'' బండబూతులు దొర్లుతుండగా సుబ్బయ్య వీరంగం దొక్కసాగాడు. ''రెండు గుక్కలు టీనీళ్లు తెచ్చేవగలేదు. నీకెందుకురా వుద్యోగం? అణవరించుకోనం చేతగానోడివి, నీకెందుకురా పెండ్లావు? నీ పెండ్లాన్నెవురయా మింగెయ్యేరు. నడువు బయటికి! యాడున్నట్టుగా రావాల... కదులు ముందుకు...''

అడుసులో నడుస్తున్నట్టుగా పాదాల్ని బలవంతంగా కదుపుతూ ఫ్లాస్కు చేతికందుకుని కడప ముందుకు నడచాడు సంజీవి. గులకరాళ్లంత పెద్దవైన వడగండ్లు మిస్సైల్స్‌లా అతడిపైకి దూసుకొచ్చాయి. తడిసిన పిల్లిపిల్లలా ముడుచుకుపోతూ రోడ్డువైపునకు కలయజూశాడతను. చీకటి, చినుకులు, వడగండ్లు, యీదురుగాలులు కలిపి నేసిన చిక్కటి తివాచీని రెండుగా కతితరిస్తున్నట్టున్న వొంటరి దీపమొకటి యింటివైపునకు మెల్లగా పరతెంచి వస్తోంది. దీపం మరికాస్త దగ్గరికి రాగానే కీచురాళ్ల కోరస్‌లా గంట గణగణా మోగింది. ఆగిన సైకిలుపైనుంచీ కిందికి గెంతి ''యీ వానలో యాడికిరా సంజీవి?'' అని అడుగుతూ సైకిలునలాగే అవతలగా పైకెత్తి, యింటిలోపలికెత్తుకొచ్చి, గోడపక్కన నిలబెట్టేశాడు తయీడిగ మునిరత్నంనాయుడు.

''చేతిలో ఫ్లాస్కు గనబడ్లేదా?'' అంటూ సుబ్బయ్య నిష్టూరపోయాడు.

''ఆ పెట్రోలుబంకు కాడుండే అంగళ్లన్నీ మూసేసినారు. గుడెసెండ్ల కప్పులన్నీ కొట్టుకోనిపోయినాయి. ఆ పక్క బాట్రీలేసుకుని యెతికినా నరపురుగు కనబడదు'' అని నవ్వుతూ మునిరత్నం నాయుడు కుక్కిమంచంపైని పాతగుడ్డనొకదాన్ని చేతికందుకుని తల తుడుచుకోసాగాడు.

సుబ్బయ్య మూతి ముడుచుకుని ''యీ వానా వంగుడులో పడీలేచీ రాకపోతే నీ గంటేంపోయింది? కొంచుం గాలీవానా తగ్గినాంక రాకూడదా?'' అని కసురుకున్నాడు.

అతడి మాటలు చెవినబడనట్టుగా మంచం దగ్గరికి నడచి, ''యీ పొద్దు బిర్యానీ తెచ్చిపెట్టినావా సంజీవీ నీ పెండ్లానికి? యింత వానలోగూడా దిక్కులు తెలియకుండా నిద్రపోతావుంది!'' అంటూ కిసుక్కుమన్నాడు మునిరత్నంనాయుడు.

యెప్పుడో నిద్రలేచిన వ్యక్తిలా లేచికూర్చుని, ''నువ్విచ్చిన దుడ్డు గుడ్లు పెడతా వుండాయని బిర్యానీ తెచ్చుకోని తిన్నాములే!'' అంది మూలస్థానమ్మ.

''యిప్పుడు తింటావా చెప్పు. రేయ్ సంజీవీ! బిర్యానీ పొట్లం తీసకరా పో'' అంటూ మునిరత్నం నాయుడు యాభైరూపాయల నోటు పైకి తీసి రెపరెపలాడించాడు.

''టీ హోటలోళ్లు మూసుకోని పోయినారుగానీ బిర్యానీ హోటలోళ్లు మాత్రం జాగారం జేస్తావుండారు. పోయిరారా!'' అన్నాడు సుబ్బయ్య వెక్కసంగా.

యీసారి కూడా అతడి మాటల్ని పట్టించుకోకుండా కుక్కిమంచంపైన కూర్చుని జేబులోంచీ అగ్గిపెట్టెను పైకితీశాడు మునిరత్నం నాయుడు. బీడీ కట్టను తీసుకొచ్చి అతడి చేతికిచ్చాడు సంజీవి. మూలస్థానమ్మ వయ్యారంగా వొళ్లు విరుచుకుంటూ మంచం చివరికి జరిగింది. పెద్ద గాలి దుమారంతో బాటూ లోపలికొచ్చిన వానచినుకుల కొరడాలు వోసారి

నలుగుర్నీ పరామర్శించి వెళ్లాయి.

తడిసి ఆరిపోతున్న బీడీని గుప్పుగుప్పుమని పీల్చి రగిలించిన తర్వాత ''లూసీ, టైగరూ నిద్రపోయినట్టుండాయే యీ పొద్దు?'' అన్నాడు మునిరత్నం నాయుడు చెవులు రిక్కించి వింటూ.

''యీ పొద్దెట్టనో ఆనా బట్టలు గుడుగుప్పుమని ముడుక్కున్నాయి. సాయింత్రంనించీ పొలకువే లేదు. కొంచేపు కంటిమీద రెప్పేస్తిమో లేదో, మీ నైటువాచుమేనొచ్చి కండ్లల్లో నిప్పులు బోసుకుంటావుండాడు'' అంది మూలస్థానమ్మ ఆవులింతతో కలిసిపోతున్న కీచుగొంతుకతో.

''అయితే మీరు చేసే పనేంది? తినేసి నిద్రపొయ్యేదేనా?'' సుబ్బయ్య వాగ్వివాదాన్ని పొడిగిస్తూనే వున్నాడు.

''యెవ్వురు చెయ్యాల్సిన పని వాళ్లు సక్కరంగా జేసుంటే నేనీ పక్కకు రావాల్సిన పనేముండాది? నెలకు యేడు నూర్లిచ్చి నన్ను పనిలో పెట్టుకోవాల్సిన అవసరమేముండాది పెద్దరెడ్డికి?'' అంటూ అతడిని యెద్దేవా చేశాడు మునిరత్నం నాయుడు.

''నేను డూటీలోకి జేరినాంక యీ పక్క నాకు తెలవకుండా పసరమైన కదిలీ మెదిలుండునా? కొత్త నవురెవుడైనా తిరిగీ మల్లా జూసుండునా? యీ సంజీవిగోడూ, వాని పెండ్లామూ చుట్టాలు గిట్టాలూ అని మందలు మందలుగా జనాన్ని జేర్చుకున్నప్పుడంతా కంటిమింద రెప్పెయ్యకుండా కావిలి కూసోనునింది నేనే గదా? యెప్పుడో వొగతూరి వొళ్లు బాగలేక్కుండా పొయినప్పుడు డూటీకి రాకపోతే అది కూడా తప్పేనా?'' అని ఆక్రోశించాడు సుబ్బయ్య చేతులు రకరకాల భంగిమల్లో తిప్పుతూ.

''దొంగలు పడిన దినంనాడే పనెగ్గొట్టి వొళ్లు బాగలేదంటే యేం లాభం? వొకసారి నమ్మకం పోయినాంక యింక జల్మంలో యెవుడూ నమ్మడు. అసలు ఆ పొద్దే పనికెందుకు రాలేదు? అంటే నీకూ ఆ దొంగనాయాండ్లకూ యేందో కనెక్షనుండాదనేగదా అర్థం?'' అంటూ మునిరత్నం నాయుడు లా పాయింటు పైకి తీశాడు.

''అట్లడుగు... వూరికే కడుపాత్రం కోసం పనిజేసుకునే వాళ్లమింద నిందేసినట్టు గాదని చెప్పు...'' అంది మూలస్థానమ్మ సరాయిస్తూ.

గాలితోబాటూ వర్షంగూడా వేగాన్ని తగ్గించుకుని అలసట తీర్చుకుంటోంది. వర్షంలో తడిసి తల్లిదండ్రుల ముందు ముద్దాయిల్లా నిల్చున్న కుర్రాళ్లకు మల్లే రోడ్డు పక్కన నిల్చున్న చెట్లు మౌనం వహిస్తున్నాయి.

''వాన తగ్గినట్టుండాది. వొక తూరి యింటి చుట్టూ రవుండు గొట్టేసి రాకూడదా సుబ్బయ్యా!'' అన్నాడు మునిరత్నం నాయుడు.

''నువ్వే పాయిరా! నీకు సంబళం యిస్తావుండ్లేదా?'' అంటూ సుబ్బయ్య మూలిగాడు.

మంచంపైన మూలస్థానమ్మ వైపుకు సోలుతున్నట్టుగా నడుం వాల్చి, ''సరే, ఆ మాటే

చెబుదువులే రెడ్డితో...'' అన్నాడు మునిరత్నం నాయుడు.

చెవిలో చెక్కుకున్న బీడీ ముక్కను తీసి పెదవుల మధ్య బిగించి అగ్గిపుల్ల గీస్తూ ''దొంగలు దొరికినారంటా వుండారు, నిజమేనా?'' అని ప్రశ్నించాడు సంజీవి మంచం పక్కన గోడవారగా గొంతుక్కూచుంటూ.

''తప్పు చేసినోడు యెన్నాళ్లని తప్పించుకుంటాడు? నరుడి కండ్లు కప్పినా నారాయణుడి కండ్లు కప్పేదానికయితిందా? పోలీసోళ్ల చేతిలో పడినాంక తాడోపేడో తేలిపోవల్సిందే గదా!...'' వేదాంతిలా అరమోడ్పు కళ్లతో చూస్తూ చెప్పుకుపోసాగాడు మునిరత్నం నాయుడు. ''యిరవయ్యేండ్లుగా యీ రోడ్డు మిందే తిరగతా వుండాను. ఆ పెట్రోలు బంకు దాటుకున్నాక యిదొకటే యిల్లు. అసలు ప్రసాదరెడ్డి సొంతూరు మొలకల చెరువు దగ్గిర రాగిమానుపల్లె. ఆ వూళ్లో వాళ్ల యిల్లు యీ యింటికి నాలుగైదు రెట్లుంటాది. ఆఫీసర్లు గూడా ఆ యింట్లోకి అడుగు పెట్టేదానికి హడలి చస్తారు. యెంతటోడైనా యెనకపక్క దోవగుండా వచ్చి కూలోళ్లతో మాట్లాడుకోని పోవల్సిందే. పెద్దిరెడ్డి ముందర తలెత్తుకోని తిరిగే దమ్ములెవరికీ లేవు. పల్లెల్లో పెరిగినోళ్లు టవునుల్లో యిరుకిరుకు యిండ్లల్లో బతకమంటే బతకతారా? యీ వూళ్లో కంట్రాక్టులు చేసేదానికి వచ్చీరాంగానే యిక్కడ అయిదెకరాలు నేల బేరం చేసి నడి మధ్యలో యిల్లు కట్టుకున్నాడు రెడ్డి. అప్పట్లో దొంగతనాలు జరగున్నా? యీ మధ్యలోనే మడుసులిట్ల తెలివి మీరిపోయినారు. అయిదారేండ్లకు ముందు యెవురో రాత్రుల్లో తలుపులు కొట్టినారంట. అప్పుడే కాంపౌండు గోడను పొడుగ్గా కట్టినారు. అప్పటినించీ అప్పుడప్పుడూ రెండు మూడేండ్ల కొకసారి దొంగలు తిరగతానే వుండారు. రెండు మూడు తూర్లు వుండేదంతా వూడ్చేసుకోని పోయినారు. పెద్దిరెడ్డి కాబట్టి తట్టుకున్నాడు. పోయిన తూరి పడిన దొంగలు మనుషులు గారు. ఆ పొద్దు జరిగిదేందో అందరికీ తెలిసిందే గదా!....''

మునిరత్నం నాయుడి మాటలు రుచించకపోవడంతో సుబ్బయ్య పైకి లేచి బాటరీ లైటు చేతబట్టుకుని యింటిముందున్న వరండాల్లోకెళ్లి తచ్చాడసాగాడు. అతడి పొలకువను పట్టించుకోకుండా, మూలస్థానమ్మ కేసి చూసి మెల్లగా కన్ను గీటుతూ, ''యెందరెందరో వచ్చి యిండ్లు కట్టుకునేదానికి తావు అమ్మమంటే పెద్దరెడ్డి జాన్తానై అనేసినాడు'' అంటూ కొనసాగించాడు మునిరత్నం నాయుడు. ''లేకపోతే యిక్కడ వొక కాలనీనే వచ్చుండును. వొంటిల్లు కావాటంతో దొంగల పాటుకు జాస్తి అయింది. అందుకని పెద్దరెడ్డి యీ యింటి పనెత్తుకున్నాడు. తోడుగా కింద రెండు కుటుంబరాలూ, పైన రెండు కుటుంబరాలూ గలాం బులాం అని నడయాడతావుంటే యెంత అండ! యెద్దులంత కుక్కలు రెండు, రెండు టెలిఫోన్లు, పక్కనే కడతావుండే యీ యింట్లో వాచ్‌మేను కుటుంబరవు. యిందరుండేటప్పుడు కూడా దొంగలు పడితే యింగ ధర్మమేడుంటాది?''

''తెల్లారజా మున్నాలుగ్గంటలప్పుడు దొంగలు పడిందెక్కడైనా విన్నావమాన్నా? నలుగురైదుగురు నరమానవులు తలుపులు పగలగొట్టి యింట్లో కొచ్చేసినారు గదా! పెదరెడ్డి,

ఆయన భార్య, వునింది యిద్దురే యిద్దురు. ముసిలోళ్లని వయసునైనా యెంచినారా వాళ్లు? రెండు తూర్లు గుండెకాయ ఆపరేషను జేసుకున్నానని ఆయన మొత్తుకుంటా వుంటే గూడా లెక్కపెట్టలేదంటనే! నెత్తురు రగతాలొచ్చి స్మారకం తప్పిపొయ్యేదాంకా వొదిలి పెట్టలేదంటనే! వునిదంతా వూడ్చుకోని పోయినారంట గదా! యీ యిట్లాంటోళ్లుండే రాజ్యంలో ధర్మమెట్లుంటాది లేన్నా!...'' పెదవులు చప్పరిస్తూ వుద్వేగంతో చెప్పుకు పోతున్నాడు సంజీవి.

''పెద్దగుల్లను తెల్లారే లోపల పగలగొట్టమని మేస్త్రీ అరిచేసి పొయినాడు గదా ఆ పొద్దు. రేత్రి రొండు గంటల బండి పొయ్యేదాంకా పనిజేస్తానే వుండాము. అప్పుడు పనుకున్నోళ్లకు మెలకువ వస్తాదాన్నా? రాయి పనిజేసినోళ్లూ, విషనీళ్లూ తాగినోళ్లూ వొకటే గదా? మీరంతా మందుగొట్టినామని అంటారు. పెద్దరెడ్డేమో దొంగలకూ మాకూ బంధుత్వమే వుండాదంటాడు. వుత్తి పుణ్యానికి మా యజమానుడ్ని వారం దినాలు టేషన్లో పెట్టుకోని నలగుద్ది పంపించినారు. కడుపాత్రం పనులు చేసేటోళ్లమే అనుకో! అంతలమాత్రాన అంత అణకవైపోతిమా? మా మేలు జూసినావని పెద్ద ప్రతాపాలు జేస్తావుగానీ, నిందేసినోళ్లల్లో నువ్వుగూడా వుండ్లేదాన్నా? అందురికందురూ పతివ్రతలే!'' మూలస్థానమ్మ వడగండ్ల లాటి వాగ్బాణాల్ని కురిపించింది.

సుబ్బయ్య పెద్దింటి గువ్మంం దగ్గరికెళ్లినట్టున్నాడు, కుక్కలు రెండూ పోటీపడి మొరుగుతున్నాయి. ట్రంకురోడ్డుపైన లారీ వొకటి పెద్దగా శబ్దం చేస్తూ మెల్లగా వెళ్తోంది. యింటిపక్కనున్న వీధి దీపం దగ్గర రెక్కల పురుగులు స్వైరవిహారం చేస్తున్నాయి. కింద రాలిన పురుగుల్ని స్వాహా చేస్తూ రెండు బావురుకప్పలు గంతులేస్తున్నాయి. యింకా తడి ఆరని యిటుకరాళ్ల గది మూలలోని కోడిపెట్ట, రెక్కలు టపటపలాడించి తలను మరింతగా శరీరంలోకి లాక్కొంది.

మూలస్థానమ్మ మాటలు తన చెవిన పడనట్టుగా ''వొరే సంజీవీ! రొండు పాకిట్ల మందు తెస్తావా?' అని అడిగాడు మునిరత్నం నాయుడు.

''యిప్పుడేడ దొరికితింది?'' విస్తుపోయాడు సంజీవి.

''బాలాజీ కొటాయికాడుండే ముసిలోడు మేలుకునే వుంటాడు. నీకు రెండూ, నీ పెండ్లానికు రెండూ, మొత్తం ఆరు తెచ్చేయి. దుడ్డు నేనే యిస్తాన్లే!'' అంటూ మునిరత్నం నాయుడు జేబులోంచి నోట్లు పైకి తీశాడు.

''యీ వానలో అంత దూరం పొయ్యేదెట్లన్నా! యీడ మా ఆడోళ్లకు తోడుగూడా యెవురూ లేరు...'' అంటూ సంజీవి నసిగాడు.

''యింకొంచేపుట్లో సుబ్బయ్యగూడా వచ్చేస్తాడు. మేమిద్దరుమూ యింటిని కావాలంటే దొంగల్దోలేసి నీ పెండ్లానికే కావిలిగాస్తాము. సరేనా! పదరా పద... కావాలంటే నా సైకిలు యెత్తుకుని పో...''

సంజీవి భార్య కేసి బిక్కుబిక్కుమంటూ చూడసాగాడు.

''థూత్తెరీ! టౌనులోకి పోయిరారా అంటే నీ అబ్బ సొత్తు అడమానం పెట్టమన్నెట్టు అట్లా మినకరిస్తావేందిరా దొంగనాయాలా! దుడ్డు తీసుకోని దౌడు తియ్యి...'' మునిరత్నం నాయుడికి అమాంతంగా అంత కోపమెలా వచ్చిందో అర్థంగాక సంజీవి బెంబేలు పడిపోయాడు.

''యీ నడిరాత్తిరిలో వాచ్‌మేన్ను దుడ్డిచ్చి యాడికంపిస్తావుండావు మునిరత్నం?''

కొత్త గొంతుక వినిపించగానే ఉలిక్కిపడి తిరిగి చూసి, యేడవలేక నవ్వుతూ, ''దండాలు సార్! సడీసప్పుడు లేకుండా వస్తే యెగిరట్ల పడినాననుకోండి''అంటూ మునిరత్నం నాయుడు చేతులు నలుపుకోసాగాడు.

మూలస్థానమ్మ పైకిలేచి మంచంపైని దుప్పటిని సరిజేసి ''యీ వానలో మీ పోలీసోళ్లు డ్యూటీకి రారేమోననుకునేస్తిమి సార్... కూసోండి'' అంది.

''యీ పొద్దు నేనుగాక యింకా యిద్దురు జవాన్లు స్పెషల్ డ్యూటీపైన వస్తారు. నీ మొగుడు టీలు దెచ్చేదానికి బయల్దేరినట్టుండాడు. అందురికీ తెమ్మను...'' అంటూ మంచంపైన కూర్చుని, అది కిర్రు కిర్రుమనగానే ''యిదెప్పుడో నా బరువుకే యీడిగిలబడితింది'' అంటూ పెద్దగా నవ్వేశాడు పోలీసు గురవయ్య.

సంజీవి అతని ముందుకొచ్చి నిల్చుని ''యీ వానాగాలికి తట్టుకోలేక టీ బంకోడు అంగిడి మూసేసినాడు సా...'' అన్నాడు.

''బాలాజీ కొటాయి కాడుండే టీ బంకు దాంకా పోయి రమ్మంటావుండాను సార్...'' సంజీవి సమాధానానికి కొనసాగింపులా అందుకున్నాడు మునిరత్నం నాయుడు.

''తుమ్మలగుంట రోడ్డు దగ్గిరుండే బాడిసమాను యిరిగి రోడ్డుకడ్డంగా పడిపోయింది. ట్రాఫిక్ జామ్ అయింది. నా మోపెడ్డును ఆపక్కనుండే ఫారస్టు చెక్‌పోస్టు వరండాలోకి తోసేసి వస్తా వుండాను. యిప్పుడు బాలాజీ థియేటరుదాంకా పొయ్యొచ్చేది అయ్యేపనిగాదు. కావాలంటే ఆ మూలుండే కోడిపెట్టను కోసుకోని బిర్యానీ చేసుకుందాం. పొయ్యి ముట్టిస్తావా మూలస్థానమ్మా!'' చల్లటి యీదురుగాలుల్ని యెగతాళి చేస్తున్నట్టుగా నుదుటిపైన కారుతున్న చెమట ధారల్ని తుడుచుకుంటూ అడిగాడు గురవయ్య.

పాత సిమెంటు గోతాలు రెండు పరచుకుని గోడవారగా కూర్చున్న మూలస్థానమ్మ మౌనంగా వుండిపోయింది. సూటిగా తననే చూస్తున్నట్టున్న కోడిపెట్ట చూపుల బారినుంచీ తప్పించుకోవడం కోసమన్నట్టుగా సంజీవి ముఖం అవతలికి తిప్పుకున్నాడు. అప్పుడప్పుడూ చినుకులు తనను పరామర్శిస్తున్నా పట్టించుకోకుండా మునిరత్నం నాయుడు మాత్రం గేటు దగ్గిరి స్టూలుపైన నిశ్చలంగా కూర్చుండిపోయాడు.

బాటరీలైటు పార్టులన్నీ విడదీసి కుప్పలా తయారుచేసిన తర్వాత ''దీని చాప్టరింక క్లోజ్'' అని బిగ్గరగా నవ్వేసి ''బిర్యానీ లేకుంటే పోయింది. కొంచెం టీ అయినా కాంచకూడదా మూలస్థానమ్మా'' అని అడిగాడు గురవయ్య.

''పాలు లేవన్నా?'' ఆమె సమాధానం ప్రశ్న ముగియకముందే దూసుకొచ్చింది.

''పాల్లేకుండా టీ తాగితే కడు పొర్దంటిందా? పోనీ కోడిగుడ్లుంటే వుడకబెట్టు'' అతను పట్టు వదల్లేదు.

''కట్టెలన్నీ తడిసిపోయినాయి. యింకొంచేపుట్లో తెల్లారిపోతింది.. మూతి కడుక్కోని యేకంగా చద్దే తాగొచ్చు...'' సంజీవి గ్రుక్కిళ్లు మింగుతూ వినబడీ వినబడనట్టుగా గొణిగాడు.

''యింట్లో కిరసనాయిలు స్టౌ తెచ్చి పెట్టుండ్లేదా? మీకంత కష్టమయితే వొద్దులే! మునిరత్నం చెయ్యి తగిలితే చింతపండు నీళ్లు కూడా బ్రహ్మాండంగా వుంటాయి...''

ఆ మాట కోసమే యెదురు చూస్తున్న వాడిలా మునిరత్నం నాయుడు పైకిలేచి ''కోడిగుడ్లు ఆ మూల అలమారులో వుండాలన్నా?'' అంటూ లోపలికి నడిచాడు.

సంజీవి హడావుడిగా పైకిలేచి, ''యీ దొంగముండా పెట్ట నాల్గైదు దినాలుగా ఆడేన్నో గుడ్లు పెట్టేసి వస్తా వుండాదన్నా!'' అని అరుస్తూ మునిరత్నం కంటే ముందుగా లోపలికి పరిగెత్తాడు.

యింకా పారపట్ గోడలు పైకి లేవకపోవడంతో స్లాబ్ పైన్నుంచీ టపటపమంటూ చినుకులు దొర్లుతున్నాయి. గాలిలో వేలాడుతూ ప్రసాదరెడ్డి బంగళాలోకి వెళ్తున్న టెలిఫోను వైరు పైన బారులుగా నిల్చున్న బిందువులు జంబుతీగకు చెక్కిన చేప పిల్లల తలల్లా మిలమిల మెరుస్తున్నాయి. యింటి లోపలి గదిలోంచీమునిరత్నం నాయుడు దొర్లిస్తున్న సామాన్ల చప్పుడూ, వారిస్తున్న సంజీవి గొంతుకా వొకదానితో వొకటి పోటీపడుతున్నట్లుగా వినిపించసాగాయి. జరుగుతున్న పోరాటంతో తనకేమాత్రమూ సంబంధం లేదన్నట్టుగా కూర్చున్న మూలస్థానమ్మ కేసి క్రీగంటితో చూస్తూ ''యీ యరవదాంకా నిద్రపోకుండా నువ్వూ నీ మొగుడూ యేం జేస్తావుంటిరి?'' అని సరాయించాడు గురవయ్య.

''యీ దిక్కుమాలిన కొంపకు వాచ్‌మేనుగా వచ్చిన కాడినుంచీ కంటిమీద రెప్పేసే దానికి కూడ దోవలేదు సార్.'' అని కాస్సేపాగి ''నీ ధర్మమా అని...'' అంటూ ముక్తాయించింది మూలస్థానమ్మ. ''పగులంతా కాయకష్టం జేసినోళ్లు రేత్రిళ్లయినా నిద్రపోకపోతే యెట్ల? మేము కునుకుదీస్తే చాలు, మీ నైటు వాచ్‌మేన్లు కండ్లల్లో నిప్పులు బోసుకుంటా వుండారు. చాలని దానికి మీ పోలీసోళ్లు. మీరంతా పగుల్లో జమ్మని నిద్రపోతారు. పగుల్లో నడుం వాల్చినామంటే మేస్త్రీలు మమ్మల్ని కేవలంగా మాట్లాడతారు...''

ఆమెకేసి యెగాదిగా చూస్తూ ''మొగుడూ పెండ్లాలిద్దరూ గిన్నెకోళ్ల మాదిరిగా నిగనిగలాడతావుండారు. యీ నీళ్లు వొంటికి పట్టినట్టుండాయి'' అన్నాడు గురవయ్య ముఖం ముడుచుకుని.

కోడిగుడ్లున్న ప్లాస్టిక్ బుట్ట నెత్తుకుని పరిగెత్తుకొచ్చిన మునిరత్నం నాయుడు ''మొత్తం రు గుడ్లుండాయిసా...'' అన్నాడు గసలుబోస్తూ.

యిప్పటికే మనం వాళ్లిద్దరి వుసురు బోసుకుంటా వుండావంట! యింకా ందుకు మూటగట్టుకోవాల. ఆ స్టవ్వు దెచ్చి నువ్వే వుడకబెట్టు...'' అన్నాడు

గురవయ్య.

మూలస్థానమ్మ నిట్టూరుస్తూ పైకి లేచి, లోపలి గదిలోకెళ్లి కిరసనాయిలు స్టవ్వుతోపాటు పాత్రలు గూడా తీసుకొచ్చింది. మునిరత్నం నాయుడు స్టౌ వెలిగించి, సత్తుగిన్నెలో నీళ్లు పోసి కోడిగుడ్లు వుడకబెట్టసాగాడు. మూలస్థానమ్మ కాగితం పొకెట్లలోని కారం పొడీ, పసుపుపొడి, వుప్పూ తీసుకొచ్చి అతడిముందుంచింది. కాస్సేపటి తర్వాత ''యీ గుడ్లు మన పెట్ట పెట్టినవి గాదన్నా! మేస్త్రీ రెడ్డప్ప తెచ్చి పెట్టినాడు'' అన్నాడు సంజీవి నగరుస్తూ.

అతడి మాటలు పట్టించుకోకుండా ''వూరువూరంతా జాగారం చేస్తావుంటే నీ పెండ్లాం మాత్రం నిద్రో నిద్రో అంటా వుందేందిరా సంజీవీ? మీ వోటు యే బూత్‌లో వుండాదో తెలుసుకుంటివా?'' అని అడిగాడు గురవయ్య.

''యెవ్వురు గెలిస్తే మాత్రం మాకేమొస్తుందిలే సా... ఆ మాత్రం దానికి మా వూరికి చార్జీలు పెట్టుకోని పోయిరావాల్నా...'' అంది మూలస్థానమ్మ.

''నీ అంత నిమ్మళంగావుండేదానికి మాకయితిందా? రేపు తెల్లారితో బండ్లవీధిలో బూత్ దగ్గర డ్యూటీ. రేత్రికి పద్మావతీ కాలేజీ కాడ వోట్ల బాక్సులకు కాపలా. కౌంటింగు అయ్యేదాంకా యేడ పడుండమంటే ఆడనే మకాం. దొరికినప్పుడు కడుపునిండా యేదో వొకటి తోసెయ్యాల. మల్లంక దొరికి తిందో దొరకదో?''

గదంతా క్రమ్ముకుంటున్న కిరసనాయిలు వాసనను మరికాస్త యెగదోస్తూ ''యెలక్షను డూటీకొచ్చిన ఆఫీసర్లకూ; అందరికీ మా వూళ్లో కోళ్లు గోసి బిర్యానీలు వడ్డిస్తారుగా... నువ్వేమో పస్తుపడుండాలంటావేంది?'' అని అడిగాడు మునిరత్నం నాయుడు.

''పల్లెల్లో డ్యూటీలు జేస్తే ఆ కతే వేరు. అసలు మాకు ముందుగా పోస్టింగేసిందేమో సత్యవేడు మండలంలో. మీ పెద్దరెడ్డి మా యెస్పయ్యికి ఫోన్లమీంద ఫోన్లు జేసి ఆగడం జేసేసినాడు. యీ బీటు పనికి ముగ్గురు పోలీసుల్నయినా అంపించకపోతే కొంప గుండమయిపోతిందని గోడుగోడుమన్నాడు. యెలక్షన్లప్పుడు యెందురు పోలీసులైనా సరిపోరు. మీ రెడ్డికేమో హైదరాబాదునుంచీ రికమండేషను. మా ముగ్గుర్నీ రాత్రి యిక్కడ్నే బీటు పని చేసి, రేపు తెల్లారికంతా పోలింగు బూతుకాడ అటెండుకమ్మని ఆర్డరు... అసలు తొలీ తడవ యీ బంగళాలో దొంగలు పండిందెప్పుడో తెలుసునా మీకు...?''

''యెందుకు తెలియదు సా... పోయిన సమత్సరంగాక అంతకుముందు సమత్సరానికి ముందు గంగజాతరప్పుడు... అప్పుడు పెద్దరెడ్డింట్లో వున్న రెండు సీమకుక్కల్ని కాపుగాస్తావునింది నేనేగదా!...'' అన్నాడు మునిరత్నం నాయుడు.

''కచ్చితంగా పార్లమెంటు యెలక్షను తెల్లారితో జరిగితిందనంగా ఆ తెల్లారుజామున జరిగింది దొంగతనం...''

గురవయ్య మాటలకు మునిరత్నం నాయుడు అవునన్నట్టుగా తలవూపాడు.

''రెండోసారి జరిగిందేమో అసెంబ్లీ యెలక్షన్ల దినం తెల్లారుజామున్న... మల్లంక రేపు మళ్లా పార్లమెంటు యెలక్షను. అంటే యేందీ మతలబు...'' కాళ్లూ చేతుల్నీ నాలుగు దిక్కులవేపూ చాపుకుని మంచంపైన పడుకుంటూ గురవయ్య వుదాసీనంగా ప్రశ్నించాడు.

పెదవుల మధ్యనున్న బీడీ జారి కింద పడిపోతుండగా ''మళ్లా రేపు యెలక్షను గదసా...'' అన్నాడు వణుకుతున్న గొంతుకతో సంజీవి.

మూలస్థానమ్మగూడా తూనీగలా కనుగుడ్లు తిప్పుతూ ముందుకు వంగి చెవులు రిక్కించుకుని కూర్చుంది. యెవరో ముందుకు నెట్టినట్టుగా సుబ్బయ్య వరండాలోంచీ లోపలికొచ్చి మంచం ముందు నిల్చున్నాడు.

''ప్రతిసారీ యెలక్షను జరిగినప్పుడే యిక్కడ దోపిడీ లెందుకు జరగాల...?'' గురవయ్య కళ్లు మూసుకుని చెప్పసాగాడు. ''అంటే యెలక్షన్లకూ యీ దొంగతనాలకూ సంబంధముండాలనేగదా అర్థం... మొలకలచెరువు మండలమంతా చింతమాకుల రెడ్లదే రాజ్యం. పెద్దరెడ్డి టౌనుకొచ్చేసినా వూరి రాజకీయాలు మాత్రం వొదిలిపెట్టలేదు. పోయిన వారమంతా ఆయిన వూళ్లో లేడు గదా! పొయిందే వూరికి? వాళ్ల సొంతూరికి! చింతమాకుల రెడ్లంతా ఆయనకు ఫాలోళ్లు. ఆయినకు తెలియక్కుండా ఆ పక్క చీమైనాకుట్టదు. అక్కడ ఆయన పైకి యెగాదిగా చూసే ధమ్ములెవ్వరికుండాయి? అక్కడ తోక తిప్పలేనోళ్లంతా యీ వూరొచ్చి కొంప గుండం జేసి పోతావుండారు...''

''అంటే యీ దోపిడీజేసినోళ్లు దొంగలు కాదాసా..'' సుబ్బయ్య నోరు తెరిచేశాడు.

''కాదనే పెద్దోళ్ల అనుమానం...''

''అయితే యింకెవురు? గూండాలాసా...'' మునిరత్నం నాయుడు ప్రశ్నించాడు.

''కాదు...''

''యింతకూ వీళ్లెవురుసా...'' సుబ్బయ్య అడిగాడు.

''మన జిల్లాలో పడమటి పక్కన యేం జరగతావుందో మీకు తెలవదు. గవర్నమెంటు రూల్సును ఖాతరు జెయ్యకుండా, పెద్దంతరం చిన్నంతరం యెంచకుండా అన్నింటికీ మేముండామని రేత్రుల్లో బస్సుల్నీ కాల్చేస్తారు. పెద్దతలకాయల్నీ లేపేస్తారు. వాళ్లే వీళ్లేమోనని పెద్దోళ్ల అనుమానం...''

''పోయిన తడవ పడిన దొంగల్నీ పట్టేసినామంటా వుండారు. నగానట్రా రికవర్ జేసినారని గూడా చెప్పుకుంటా వుండారు. నువ్వేమో పడినోళ్లు దొంగలే కాదంటావుండావు గద సార్'' అన్నాడు సుబ్బయ్య.

పడుకునే మరో బీడీ వెలిగించి దమ్ము లాగుతూ ''దొంగతనం జరిగిన దగ్గిర్నుంచీ పెద్దరెడ్డి పెద్ద పెద్దోళ్ల దగ్గిరనుంచీ ఫోన్లు జెయ్యిస్తా వుండాడు...'' అంటూ మళ్లీ చెప్పుకుపోసాగాడు గురవయ్య. ''పెద్దోళ్ల దగ్గిరనుంచీ మాకు వొకటే దొబ్బులు. ఆ దొంగతనానికీ సంజీవిగాడికీ సంబంధమేమీ లేదని మాకు మాత్రం తెలవదా? యేందో

పెద్దరెడ్డి మనసు చల్లబడాలని వాణ్ణి వారం దినాలు స్టేషన్లో పెట్టుకోనుంటిమి. యిప్పుడూ జరిగిందదే! యెవ్వురో దొరికిన దొంగలనించీ యాభై అరవై సవరాల బంగారం రికవరయింది. రెడ్డి అది నాదే అని రాసిచ్చె. అవునో కాదో మాదేం పోయింది? కేసు మూసేస్తే అదే మాకు పదివేలు...''

విన్నంతసేపూ విని పెద్దగా నిష్టూరుస్తూ ''యీ వుద్యోగానికి మనకూ లాయితీగాదని నెత్తీనోరూ గొట్టుకుంటే మా బావ యింటేనా? చెయ్యాని పాపానికి కన్నగసాట్లూ పడినాడు. యింతకంటే మేస్త్రీ పని నేర్చుకుంటే రెండు రూకలు చానాగా కండ్లజూడచ్చు. యెక్కడైనా పూరిల్లొకటి బాడుక్కు తీసుకోని రిక్షా తొక్కుకున్నా బతికిపోతావని చిలక్కు చెప్పినట్టుగా చెప్తిని. యింటేనా?...'' అంది నీరసంగా.

''మీ కతే బాగుండాది. వాచ్‌మేన్‌గా సంబళం యేన్నూట యాభై. కూలీ జేసుకుంటే యింకో రెండు వేలు. నాకేమో నెలకంతా అయిదు నూర్లిచ్చేదానికే పెద్దరెడ్డికిష్టం లేదు'' అన్నాడు సుబ్బయ్య చురకత్తితో అరటిబోదెను కోస్తున్నంత కర్కశంగా.

గరిటెతో గుడ్లు వేపుతూ ''నీకేమైనా తాడా బొంగరమా? ఆడగాలి కావాలంటే మామండూరుకోసారి పొయ్యొస్తావు. మహా అంటే యిరవయ్యో ముప్పయ్యో ఖర్చు. నా సంగతి చూడు. వచ్చే యేడునూర్లతో ఆరుమంది బండిలాగాల...'' అన్నాడు మునిరత్నం నాయుడు.

మళ్లీ మొదలైన యీదురుగాలికి చెట్లన్నీ పిచ్చి పట్టినట్టుగా వూగుతున్నాయి. పాత గోతిలోని కప్పలు పెద్దగా శబ్దం చేస్తూ యెగిరెగిరి దుముకుతున్నాయి. బంగళాపక్కని, చీకటి నేలపైకొచ్చి పడిన వొంటరి గది కిటికీ వెలుతురులో మాత్రం మేలుకునే కూర్చున్న బట్టతల వ్యక్తి నీడ స్పష్టంగా పడుతోంది.

పెనంలో వుడుకుతున్న కోడిగుడ్లను నోరూరుతుండగా చూస్తూ ''అందురికీ తలా కొంచెం యియ్యి నాయుడూ! లేకపోతే నాకు దిష్టి తగిలేను...'' అని కాస్సేపాగి ''తిన్నట్టుగాదు. అందురూ కొంచెం పనిగూడా చెయ్యాల... రెండు గంటల రైలు కూత గూస్తా వుంది. యింకా మావోళ్లు రాలేదు. మీ రిద్దరూ కొంచెం ఆ పెట్రోలు బంకుదాంకా పోయి టేషనుకు ఫోనుగొట్టి రండి. సంజీవిగాడు యింటి చుట్టూరా నాలుగు రవుండ్లు గొట్టొస్తాడు. యీ సందులో నేనో తూరి మూలస్థానమ్మ ప్రత్యేకంగా పడే కష్టమేందో తెలుసుకుంటాను...'' అన్నాడు గురవయ్య.

సంజీవి దిగ్గున పైకి లేచి నిల్చుని, నిలువు గుడ్లేసుకుని కొయ్యబారిపోయాడు.

మునిరత్నంనాయుడి కేసి చూస్తూ సుబ్బయ్య పళ్ళికిలించాడు.

లారీలు ఢీకొన్నట్టుగా, పిడుగులు రాలినట్టుగా, కొండరాళ్లు దొర్లినట్టుగా ప్రసాదరెడ్డి బంగళా ముందునుంచీ పెద్ద శబ్దమెకటి హోరెత్తుకొచ్చింది. అసంపూర్తి భవనంలోని అయిదుగురు మనుషులూ వులిక్కిపడి వెలుపలికి పరిగెత్తుకొచ్చారు. జరుగుతున్నదేమిటో వాళ్లు గుర్తించేలోగా మరోసారి అలాంటి శబ్దమే వినవచ్చింది. యింటిలోంచీ పై

హాహాకారం పరతెంచి వచ్చింది. యింతలో యింటిచుట్టూ వున్న విద్యుద్దీపాలన్నీ భళ్లున వెలిగాయి. యేదో వింత జంతువు గొంతు చించుకుంటున్నట్టుగా పెద్ద సైరను శబ్దమొకటి చెవులు గింగుర్లెత్తేలా పెల్లుబికి వచ్చింది. అంతవరకూ వెలుతురును ప్రసారం చేస్తున్న యేకైక కిటికీ దగ్గర మాత్రం ఘాఢమైన చీకటి పేరుకుపోయింది.

''యెవురో గ్రిల్ తలుపులు పగలగొడతా వుండారన్నా!'' అన్నాడు సంజీవి భయమూ, ఆందోళనా నిండిన కీచుగొంతుకతో.

ప్రసాదరెడ్డి బంగళా ముఖద్వారం దగ్గర బనీనూ, నిక్కరూ మాత్రమే తొడుక్కున్న సన్నటి మనిషొకడు దాదాపుగా తన చేతులంత లావే వున్న యినపకమ్మీతో గ్రిల్ తలుపుల్ని బద్దలుకొడుతున్నాడు.

''రేయ్! యెవుడ్రా ఆడ తలుపులు గొట్టేది? చమడా తోలు వొలిచేస్తాను వుండాకోర్'' అని అరుస్తూ మోల్డింగ్ కమ్మీ నొకదాన్ని చేతబట్టుకుని సుడిగాలిలా బంగళా ప్రహరీదాకా పరిగెత్తుకెళ్లిన సుబ్బయ్య, మళ్లీ అదే వేగంతో వెనక్కు తిరిగొచ్చి ''న్నోవ్! వొక్కడుగాదు, మిద్దెపైన జూడు. యిద్దురు నవుర్లు నిక్కినిక్కి జూస్తావుండారు...'' అన్నాడు రహస్యం చెబుతున్నట్టుగా.

ట్రంకురోడ్డు వైపుకు తిరిగి చూసిన మునిరత్నం నాయుడు ''సార్! సార్! అక్కడ జూడండి. యిద్దురు మనుషులు యీ పక్కనే వస్తావుండారు!'' అన్నాడు ఆందోళనతో వూగిపోతూ.

వొకటి రెండు నిముషాలు అటే పరీక్షించి చూసి ''వొరే సంజీవీ! ఆ వచ్చేది మా జవాన్లుగానే వుండాది. వాళ్లనట్లే పెట్రోలు బంకుదాంకా పోయి, టేషనుకు ఫోనుజేసి, యెందురుంటే అందురు జవాన్లనూ అంపించమని చెప్పమను. అర్జెంటుగా లగెత్తు...'' అని ఆర్డరు వేశాడు.

యీలోగా నీడల్లా నడచివస్తున్న జవానులిద్దరూ చేనులోపడ్డ పందుల్ని తరుముకునే జోగలవాళ్లల్లా పెద్దగా అరుస్తూ, రోడ్డుపైన వెళ్లే వాహనాలను ఆకర్షించే ప్రయత్నం చేయసాగారు.

''సార్! ఆ యెనకపక్క గూడా యెవురో గేటు కొడతా వుండారు...'' అంది మూలస్థానమ్మ దాదాపు యేడుస్తున్నట్టుగా.

''వొరేయ్ సంజీవీ! ఆత్రం వద్దు. ముందుగా వాళ్లెంత మందుండారో లెక్కగట్టాల. అప్పుడుగానీ మనం అటాక్ జెయ్యలేం. గేటు దగ్గిర వొకడు. యెనకాల వొకడు. మిద్దెపైన యిద్దురు. కాంపౌండు గోడ దగ్గిర వొకడు. వానికి నూరడుగుల దూరంలో వొకడు. యీ మాదిరిగా వాళ్లెంత దూరం నించీ వలేసుకోని కూచోనుండారో తెలవడం లేదు. వాళ్ల చేతుల్లో కట్టెలూ, కత్తులూ, బిచువాలే వుండాయో లేకపోతే తుపాకులూ, బాంబులే వుండాయో తెలియకపోయ. మనముండేది నలుగురు. యిప్పుడేం జెయ్యాల?'' అంటూ ారవయ్య యెటూ పాలుపోక నిలబడిపోయాడు. గ్రిల్ తలుపులు కొద్దిగా

విరిగినట్టున్నాయి. పెలుబుకుతున్న శబ్దంలో మార్పు స్పష్టంగా వినబడుతోంది. వెనకవైపున్న బల్బులు పగులుతున్న శబ్దం...

యింటిలోపలి నుంచీ నీరసంగా వొకదానితో వొకటి పెనవేసుకుంటున్న ఆక్రోశాలు రెండు.. యింకా పూర్తిగాని యింటి గోడలకు తగిలి పరావర్తనం చెంది వొకదానితో వొకటి ఢీకొట్టుకుంటున్నట్టున్న ఆక్రోదనలు నాల్గైదు... చిక్కటి చీకటి చర్మాన్ని యిష్టమొచ్చినట్టుగా తూట్లు పొడుస్తున్న రకరకాల శబ్దాలు...

మూలస్థానమ్మ యింటిలోపలి కెళ్లింది. మరో అయిదు నిముషాల తర్వాత బాంబు పేలినట్టుగా పెద్ద శబ్దమొకటి వెలుపలికొచ్చింది. వరండాలోని నలుగురు మగవాళ్లూ వులిక్కిపడి లోపలికి పరిగెత్తారు.

''పోయిన నోముల పండగనాడు మా అబ్బోడు తెచ్చిపెట్టిన పెట్లొప్పు... రోట్లో వేసి రోకలితో వొకటిస్తి. వాళ్లను కొంచెం బయపెడదామని...'' ముసురుకుంటున్న పెట్లొప్పు పొగల్లోంచీ మూలస్థానమ్మ మాటలు చిత్రంగా పలికాయి.

''నీకేం పోయేకాలం వచ్చిందే! నీ కసలు బుద్దుండాదా?'' నిలువునా వణికిపోతూ గురవయ్య ఆమె వైపునకు పరుగెత్తుకొచ్చాడు. ''మనం బాంబులేసినామనో, లేకపోతే ఫైరింగే జేసినామనో వాళ్లనుకుంటే మన గతేమయ్యేను? వాళ్లు రెండు బాంబులిసిరినారంటే యింక మన పని పైసలే గదా! యీ వుపాతకం తెలివితేటలెక్కడినుంచీ వచ్చినాయి నీకు?''

''దొంగలంజా! నీకీపెత్తన మెవురిచ్చినారే!'' అంటూ సంజీవి ఆమెపైకి విరుచుకుపడి కొట్టినంత పని జేశాడు. ఆమె అతడి చేతికి దొరకకుండా వరండాలోకి పరిగెత్తింది.

ప్రసాదరెడ్డి బంగళా ముఖద్వారం దగ్గరి విద్యుద్దీపం గ్రెనేడులా చిట్లిపోయింది. గ్రిల్ శబ్దం కూడా ఆగిపోయింది. రోడ్డు దగ్గరున్న పోలీసులు గూడా మాయమైపోయారు. అసంపూర్తి భవనంలోని అయిదుమందీ బల్లుల్లా గోడకంటిపెట్టుకుని, కళ్లు చించుకుని, చీకట్లోకి చూడసాగారు. యీదురుగాలి ముసురుకుంటూనే వుంది.

''న్నోవ్! యింటియెనకాలేందో రవరవామంటావుంది...'' అంది మూలస్థానమ్మ వీలయినంత మెల్లగా స్వరాన్ని తగ్గించి.

తానూ చెవులు రిక్కించి వింటూ ''యేం లేదు. నువ్వు నోరు ముయ్యి'' అంటూ సంజీవి ఆమెను విసుక్కున్నాడు.

''వొరే సంజీవీ! వాళ్ల దగ్గిర బాంబులేవీ వుండేట్టు లేదు. నీ భార్య పెట్టిన మూత పొగకే యీ సుళ్ల మాదిరి యిరసక పడిపోయినట్టుండారు... అందుకే పొలకువేలేదు'' అన్నాడు గురవయ్య అప్పుడప్పుడే కూడగట్టుకున్న ధైర్యంతో.

బంగళా ముందున్న పూలకుండీలు పగులుతున్న శబ్దం వినరాసాగింది. చెట్ల కొమ్మలు పెళపెళా విరగసాగాయి. కిటికీల అద్దాలు జల్లుజల్లుమంటూ రాలి విరిగిపడసాగాయి. కారుషెడ్డు తలుపులు కూలుతున్నాయి. కారు అద్దాలు సైతం చిట్లుతున్నాయి.

యిటుక గోడల వరండాలోని అయిదుమందీ వొకరి గుండెల సవ్వడి మరొకరు వింటూ నిలబడి పోయారు. నడి ఆకాశం నుంచీ నేల వరకూ విస్తరిస్తూ మెరుపొకటి భీకరంగా మెరిసింది. డబడబమంటూ మేఘాలు దొర్లుతున్నాయి.

రోడ్డు దగ్గరినుంచీ బిలబిలమంటూ జనమొస్తున్న సవ్వడి వినవచ్చింది. బ్యాటరీ దీపాల బారులు పొడుగ్గా సాగుతున్నాయి.

''మాజవాన్లు జనాల్ని కూడగట్టుకొని వస్తావుండేటట్టుంది. యింక భయం లేదులే?'' అని తనకు తాను ధైర్యం తెచ్చిపెట్టుకుంటూ గురవయ్య యింటి వుుందుకొచ్చి నిల్చున్నాడు.

బంగళా వెనకవైపునుంచీ నేలను బాదుతున్నట్టున్న పాదాల సవ్వడి బిగ్గరగా వినిపించసాగింది.

''పట్టుకోండి... పట్టుకోండి. తప్పించుకుంటా వుండారు. వొక్కడు గూడా తప్పించుకోని పొయ్యేదానికి కుదరదు...'' అంటూ గురవయ్య కదనుతొక్కసాగాడు.

కాసేపటి తర్వాత చుట్టూ వోసారి తిరిగి చూసి పెద్దగా నిట్టూర్చాడతను.

బంగళాలో నుంచీ ప్రసరిస్తున్న గుడ్డిదీపాల వెలుతురులో విరిగిన మొక్కలు, పగిలిన కుండీలు, చిట్లిన గాజుపెంకులు యుద్ధం తరువాతి రణక్షేత్రాన్ని జ్ఞాపకం చేస్తున్నాయి. వొంటరి కిటికీ దగ్గరి బట్టతల వ్యక్తి నీడ కనిపించకపోవడంతో గురవయ్య కంగారుపడుతూ బంగళా దగ్గరికి పరిగెత్తాడు.

''తలుపులు తెరవండి మేడమ్! మాజవాన్లను చూసి వాళ్లు పారిపోయినారు. యింక భయం లేదు...'' అంటూ పగిలిన ద్వారపు తలుపులు సందులోంచీ కేకలేయసాగాడు.

కాస్సేపటి తర్వాత తలుపుల పక్కనున్న కిటికీ వుూత్రం వోరగా తెరుచుకుంది. లోపలినుంచీ మాట్లాడుతున్న దెవరో వరండాలో నిల్చున్న వాళ్లకు తెలియలేదు. అయిదారు నిముషాల తర్వాత గురవయ్య వెనక్కు తిరిగొచ్చి ''యిదిగో సిన్నబ్బా! వాళ్లు టెలిఫోను తీగల్ని కత్తిరించేసినారు. ప్రసాదరెడ్డికి మళ్లా గుండెనొప్పొచ్చింది. అర్జెంటుగా ఆస్పత్రికి చేర్చాల. ఆ పెట్రోలు బంకు కాడికి పొయ్యి యమర్జెంటుగా అంబులెన్సు అంపించమని ఆస్పత్రికి ఫోనుగొట్టు'' అని తన అనుచరుల్ని పురమాయించాడు.

యింతలో యేదో జ్ఞాపకం వచ్చినట్టుగా మూలస్థానమ్మ అసంపూర్తి భవనంలోకి పరిగెత్తింది. కాస్సేపటి తర్వాత తిరిగొచ్చి, ''యింటెనకాల యెవురో యేందో కలబెడతా వుండారని నేను మొత్తుకుంటే మీకు కాబట్టలేదు. యిప్పుడు చూడండి. బంగారట్లా కోడిపెట్ట కనబడాటం లేదు. దానివింద కన్నుబడిందే వాళ్లకు...'' అంటూ గొల్లున యేడుస్తూ కూలబడిపోయింది.

*(23 - 30 జనవరి 1998, ఆంధ్రజ్యోతి వారపత్రిక)*